క్లుప్తంగా

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు.

నిబంధనలు బేఖాతర్

పిఠాపురం: తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు తప్ప ఏఇతర నాయకులకు పాఠశాలల్లో ప్రవేశం లేదు అంటూ డైరెక్టర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ విజయరామరాజు ఈనెల 1న విడుదల చేసిన సర్క్యులర్‌ను పిఠాపురంలో కూటమి నేతలు తుంగలో తొక్కారు. నిబంధనలకు విరుద్ధంగా కూటమి నేతలు పాఠశాలల్లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని ఈ సర్క్యులర్ మాకు వర్తించదు అని నిరూపించారు. పిఠాపురం ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాల్లో జనసేన ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తన అనుచరగణంతో హాజరై జాతీయ జెండాలు ఎగురవేసారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో వివిధ పాఠశాలల్లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో స్థానిక కూటమి నేతలు పాల్గొనడం విమర్శలకు దారి తీసింది. పిఠాపురం విద్యాశాఖాధికారుల తీరును ప్రజలు విమర్శిస్తున్నారు.

విద్యార్థులకు జాతీయస్థాయి బహుమతులు



జాతీయస్థాయి బహుమతులు అందుకున్న విద్యార్థులు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయి బహుమతులు శుక్రవారం పాఠశాలలో అందుకున్నారు. విద్యార్థులకు 2025 సంవత్సరంలో జాతీయస్థాయిలో యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ న్యూఢిల్లీ వారు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. 7 తరగతి చదువుతున్న రామిశెట్టి హనుమంత పవన్, 10 తరగతి చదువుతున్న మేరుగు స్టీఫెన్, సూరాడ వందు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయురాలు యాళ్ల పద్మజను ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

కలుషిత నీటి సరఫరా



పండూరు నీటి పథకం నుంచి సరఫరా అవుతున్న కలుషిత నీరు

కాకినాడ రూరల్: రంగు మారిన కుళాయి నీటిని సరఫరా చేయడంతో తాగలేక ఇబ్బందులు పడుతున్నామని తిమ్మాపురంలోని మారుతినగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండూరు సీపీడబ్ల్యూఎస్ నుంచి తాగు నీటిని ఫిల్టర్ చేయకుండా చాలా రోజులుగా పంపింగ్ చేయడంతో కుళాయిలు ద్వారా నీరు రంగు మారి వస్తోందని, వీటిని తాగు నీటి అవసరాలకు వినియోగిస్తున్నామన్నారు. దీనిపై గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణను వివరణ కోరగా వేసవి నుంచి పండూరు వాటర్ స్కీమ్ నుంచి తిమ్మాపురంలో ఎరుపు రంగులో నీరు వస్తోందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

బోట్‌క్లబ్: ప్రతిభావంతులైన విద్యార్థులకు విజోస్ హోమ్ వ్యవస్థాపక చైర్మన్ పైండా రామకృష్ణారావు శుక్రవారం ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక సాలిపేట మున్సిపల్ గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు ఈ మేరకు స్కాలర్‌షిప్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్రం సీనియర్ అసిస్టెంట్ బచ్చు నాగబాబు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీరమణి పతాకావిష్కరణ



పిఠాపురంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వేడుకలు

మురిసిన మువ్వన్నెల జెండా

- ఘనంగా జాతీయ పతాకాల ఆవిష్కరణ
- వైభవంగా స్వాతంత్ర్య వేడుకలు

సామర్లకోట: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుని పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లో శుక్రవారం వాడవాడలా త్రివర్ణపతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలు, సచివాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాసంఘాలు, వివిధ మత సంఘాల నాయకులు స్వాతంత్ర్య వేడుకలు జరుపుకున్నారు. పంద్రాగస్టు సందర్భంగా పల్లెలు, పట్టణాల్లో పండగ వాతావరణం నెలకొంది.

పండగ వాతావరణంలో జాతీయ పతాకావిష్కరణ

స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి



సామర్లకోట గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన దొరబాబు

ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టరు అమల అధ్యక్షత వహించారు. స్థానిక గాంధీచౌక్‌లోని గాంధీజీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గొకిన సునేత్రాదేవి, వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి చెర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి జెండా ఎగురవేశారు. కమిషనర్ ఎ శ్రీవిద్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఆవిష్కరించారు. జెట్‌పీటీసీ సభ్యురాలు ఎలిసెట్టి అమృత, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, రైల్వే స్టేషన్ ఆవరణలో స్టేషన్ మేనేజరు ఎం రమేష్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ బీవీవీ సత్యనారాయణ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

చిన్నారిని అభినందించిన దొరబాబు

స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా శుక్రవారం స్థానిక గాంధీచౌక్‌తో జాతీయ జెండా రంగులో గౌను వేసుకొని చలాకీగా తిరుగుతున్న బాలికను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు గమనించారు. ఆ బాలికను ఆయన ఎత్తుకొని అభినందించారు.

పెద్దాపురం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీఓ కె.శ్రీరమణి, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీహరిరాజు, డీఎల్‌పీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ బాలామణి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మౌనిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెంకే సత్యవతి పతాకావిష్కరణ చేయగా వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఎంపీడీఓ శ్రీలలిత పాల్గొన్నారు. నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ బి.సీతాదేవి, శాఖా గ్రంథాలయంలో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు పతాకావిష్కరణ చేశారు.



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ పతాకావిష్కరణ

పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల, ది మండల ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు కేఫా ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మార్మోగిన వందేమాతరం

పిఠాపురం: నియోజకవర్గంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకినాడ మాజీ ఎంపీ వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత ఆధ్వర్యంలో పిఠాపురం పార్టీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, నేతలు వర్దినీడి సుజాత, తలిశెట్టి వెంకటేశ్వరరావు, పచ్చిమళ్ల జ్యోతి, ఉలవల భూషణం, పెదపాటి రాజేష్, బత్తుల సాయిరామ్, సయ్యద మొహీద్దీన బొజ్జా రామయ్య, లలిత, చింతాడ నీలవేణి పాల్గొన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. పోలీసు కార్యాలయాల్లో సీఐ శ్రీనివాస్ ఎస్సైలు జాతీయ పతాకాలను ఎగుర వేసారు. పిఠాపురం కోర్టుల సముదాయంలో న్యాయమూర్తుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొత్తపల్లి మండల పరిధిలో..

కొత్తపల్లి : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారే సుధ జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరికృష్ణ పాల్గొన్నారు. కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్సై వెంకటేష్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తహశీల్దారు చిన్నారావు ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు



గొల్లప్రోలు ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎంపీపీ అరిగెల రామయ్యమ్మ



గొల్లప్రోలులో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు

వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం భక్తి శ్రద్ధలతో మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.ఈ శ్రావణ మాసంలో రెండు, నాల్గవ శుక్రవారాల్లో పంచారామ క్షేత్రంలో మహిళలు సామూహిక వ్రతాలు ఆచరించేలా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు బియ్యం, కలశం. జాకెట్టు ముక్క మాత్రమే తీసుకొని రావాల్సి ఉంది. వ్రతాలకు కావలసిన వరలక్ష్మి రూపు, తోరాలు, లక్ష్మీదేవి ఫొటో, తదితర సామగ్రి దాతలు ఏర్పాటు చేయగా ప్రసాదాన్ని దేవస్థానం సహకారంతో ఉచితంగా భక్తులకు అందజేశారు. ఈ వ్రతాలను ఈఓ బళ్ల నీలకంఠం, మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే బాబులు, లక్ష్మీదేవి చిత్ర పటం వద్ద పూజలు చేసి సామూహిక వ్రతాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వామి, అమ్మవార్ల దర్శించుకొని వరలక్ష్మి వ్రతాన్ని పరిశీలించారు. ఈ వ్రతాల్లో సుమారు 700 మంది మహిళలు పాల్గొన్నారని ఈఓ నీలకంఠం తెలిపారు. వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్త సంఘం నాయకులు కంటే బాబు, తలుపుల అంజనీకుమార్, మలిరెడ్డి శ్రీనివాసు, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు సేవలందించారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

వరలక్ష్మి అలంకరణలో నూకాలమ్మవారు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ శుక్రవారం వరలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు సామూహిక వరలక్ష్మి వ్రత పూజ వైభవంతంగా నిర్వహించారు. భక్తులకు అమ్మవారి రూపు, జాకెట్, పసుపు, కుంకుమ, గాజులను పంపిణీ చేశారు. సుమారు మూడువేల మంది మహిళలు పాల్గొన్నారు.స్వయంభూ తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

కొత్తపల్లి: అమ్మవార్ల ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలను నిర్వహించారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలో దుర్గాదేవి, కొత్తదొడ్డిలో బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం, గొర్స, ఉప్పాడ తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు, కొత్తపల్లి ఉన్న శ్రీబాలిత్రిపుర సుందరి రాజేశ్వరి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పాడ, గోర్స, మూలపేట, యండపల్లిలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఉన్న అమ్మవార్లకు కుంకుమ పూజలను నిర్వహించారు.



పెద్దాపురం నూకాలమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో వరలక్ష్మి పూజలో పాల్గొన్న ఈఓ, పండితులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు

బోట్‌క్లబ్: న్యూఢిల్లీకి చెందిన సీతానాగజ్యోతి, అభినయ నాగజ్యోతి, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో సాగిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఫౌండేషన్ ఫర్ డెవలప్‌డ్ ఇండియా వారి ఆధ్వర్యంలో కూచిపూడి మార్గం పేరుతో స్థానిక సూర్యకళా మందిరంలో శుక్రవారం రాత్రి ఈ నృత్య ప్రదర్శన నిర్వహించారు. మా తెలుగు తల్లికి మల్లెపూ దండతో ప్రారంభమైన వీరి నృత్య ప్రదర్శన వందేమాతరంతో ముగిసింది. పూర్వ రంగం , గణేశ స్తుతి, జతిస్వరం, దశావతార శబ్దం, బృందావన నిలయమే కీర్తన, తులసీదాసు రచించిన శ్రీరామచంద్ర వంటి కీర్తనలకు కళాకారులు చేసిన నృత్యం ఆద్యంతం జనరంజకంగా సాగింది. తొలుత నాట్యాచార్య కృష్ణకుమార్, ప్రముఖ గాయని పెద్దాడ సూర్యకుమారి, లక్కరాజు సత్యనారాయణన్, తుర్లపాటి మాణిక్యాంబ, ఆనెం ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతానాగజ్యోతి మాట్లాడుతూ, తనతో పాటు, తన శిష్యులు దేశవిదేశాల్లో వందలాది ప్రదర్శనలు ఇచ్చినట్టు చెప్పారు.

గర్భిణికి అందని ప్రభుత్వ వైద్యం

ప్రత్తిపాడు రూరల్: మండల కేంద్రమై ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెటర్‌లో డెలివరీ నిమిత్తం వచ్చిన గర్భిణికి వైద్యం అందకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ధర్మవరం గ్రామానికి చెందిన రాపా ఆశకు నెలలు నిండడంతో ప్రసవం నిమిత్తం రాచపల్లి పీహెచ్‌సీ కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఆమెను తరలించారు. సీహెచ్‌సీలో వైద్య పరీక్షల్లో తల్లికి జ్వరం తోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని ఉదయం నుంచి సాయంత్రం వరకూ వైద్య సేవలు అందించి అబ్జర్వేషన్‌లో ఉంచారు. అప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో వైద్యులు కాకినాడ ప్రభుత్వం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆ సమయంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందిన ఆశ తండ్రి రాపా నీలబాబు దగ్గరలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో ఆమెను చేర్పించారు. అక్కడి వైద్యులు సిజేరియన్ చేసి తల్లీబిడ్డను కాపాడారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆరోగ్యం విషమించిన తన కుమార్తెను కాపాడుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోయినా ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాల్సి వచ్చిందని బాధితురాలి తండ్రి వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆలయాల ముస్తాబు

బోట్‌క్లబ్: నగరంలో శ్రీ కృష్ణుని ఆలయాలు కృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా కమిటీలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలతో పాటు ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. స్థానిక గోకులంలో శుక్రవారం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అష్టాదశ కలశ ఆరాధన, నవగ్రహ ఆరాధన, సహస్ర తులసీదళ అర్చన చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు విశేష సహస్రనామార్చన, సాయంత్రం4 గంటలకు ఇస్కాన్ అధ్యక్షుడు అనంత శేషదాసు జన్మాష్టమి వైభవం ప్రవచనం జరుగుతుందని గోకులం అధ్యక్షులు నారాయణం మురళి తెలిపారు. అనంతరం సూర్య నృత్య నికేతన్ ఎం.భరతలక్ష్మి బృందం నృత్య ప్రదర్శన జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం గోపూజ, పల్లకి సేవ, ఉదయం 10 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణస్వామి శాంతి కల్యాణం, శ్రీపుష్ప యాగం, పవళింపు సేవ జరుగుతాయన్నారు.



కృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబవుతున్న అశోక్‌నగర్‌లోని గోకులం


స్థానిక దేవాలయంవీధిలోని ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలోను ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ఈఓ ఆర్.రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని కృష్ణాలయంతో పాటు నగరంలోని పలు కృష్ణుడు ఆలయాల్లో అష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.




అవార్డును అందుకుంటున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి



ఉత్తమ విశిష్ట అవార్డును తీసుకుంటున్న రాయవరపు సత్య



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న కొత్తపల్లి మండల తహసీల్దార్ చిన్నారావు



కొత్తపల్లి మండల పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ

ఉత్తమ సేవలకు అవార్డులు

పెద్దాపురం/కొత్తపల్లి : ఉత్తమ సేవలకు గుర్తింపుగా పలువురు ఉద్యోగులు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం పురస్కారాలు అందుకున్నారు. కాకినాడ జిల్లా పేరెడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కలెక్టర్ షాన్ మోహన్‌ల చేతుల మీదుగా అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలను వివిధ విభాగాల అధికారులు అభినందించారు.

విశాఖపట్నంలో పురస్కారాన్ని అందుకుంటున్న కొత్తపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్



దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వారికి సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే వీఎస్ లక్ష్మీ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.సంధ్య స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, ఎన్ఎస్ఎస్ పీవోలు కృష్ణ,హారిక పాల్గొన్నారు.